రోడ్డుపై ఎలా వెళతారు?

నేషనల్ హైవే మధ్యలో ఉబ్బిన తారు

- ప్రమాదాలకు నిలయంగా రహదారి
- రోడ్డుకు సమాన ఎత్తులో డివైడర్లు..
- భయాందోళనలో వాహన చోదకులు



రోడ్డులో కలిసిపోయిన డివైడర్



తారు ఉబ్బడంతో ఎగుడుదిగుడుగా మారిన రోడ్డు

కల్లూరు: కల్లూరులోని ప్రధాన రహదారిగా ఉన్న నేషనల్ హైవే రోడ్డు మధ్యలో తారు ఉబ్బెత్తుగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్రవాహనాలు వెళ్లేటప్పుడు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వాహనదారులు, స్థానికులు తెలుపుతున్నారు. ఉబ్బెత్తుగా రోడ్డు మధ్యలో ఉండడంతో ఒక్కసారిగా వెళ్తున్న వాహనాలు పక్కకు గుంజుతున్నాయని వాపోతున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాహనాలు నడుపుతున్నారు. విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉండడంతో ఏదైనా వాహనం 5 నిమిషాలు రోడ్డు మధ్యలో నిలిచిపోతే ట్రాఫిక్ జామై పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయే పరిస్థితి ఉంది. దీని వల్ల ఇంత ట్రాఫిక్ రద్దీలో ప్రధానరోడ్డు సక్రమంగా లేక ప్రమాదాలు ఎందుకు జరగవని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ఓ పల్సర్ బైక్‌తో వెళ్తున్న పంచాయితీ కార్మికుడు కేవలం ఈ రోడ్డు సరిగ్గా లేకపోవడం వల్లే లారీ కింద పడి మృతి చెందాడని పలువురు ఆరోపిస్తున్నారు. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు సుమారు కిలోమీటరు పొడవు రోడ్డు ఉబ్బి ఉండటంతో వాహనదారులు తిప్పలుపడుతున్నారు.

శిథిలావస్థకు డివైడర్లు.. కరువైన సిగ్నళ్లు

పట్టణంలో ప్రధాన రహదారిపై రెండు కిలోమీటర్ల వరకు వేసిన డివైడర్లు శిథిలావస్థకు చేరి రోడ్డుతో పాటు కలిసిపోయాయి. రెండు వైపులా సరైన సిగ్నళ్లు లేక వాహనాలను డివైడర్ల పైకి ఎక్కిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి పూట ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఇలా డివైడర్ల శిథిలం, సిగ్నళ్లు పనిచేయకపోవడంతో ఎవరు ఎటు వెళ్తున్నారో.. ఎక్కడ ఆగుతున్నారో తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉబ్బిన తారు తొలగించి రోడ్డు మరమ్మతు చేయాలని, డివైడర్లు బాగుచేసి సిగ్నళ్లు ఏర్పాటుచేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



హైవే రోడ్డు మధ్యలో తారు ఉబ్బి ఉండడం వల్ల వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉబ్బిన తారును తొలగించి రోడ్డు మరమ్మతు చేపట్టాలి.

–ఎండీ.యాకూబ్ పాషా, కల్లూరు

సిగ్నళ్లు ఏర్పాటు చేయాలి



పట్టణంలో డివైడర్ల వద్ద సిగ్నళ్లు లేక పోవడం వల్ల వాహనాల రాకపోకల సమయంలో ఇబ్బందికరంగా ఉంది. డివైడర్లు పాడైపోవడం వల్ల రాత్రి సమయాలలో సిగ్నళ్లు లేక వాహనాలు డివైడర్లు ఎక్కి ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి డివైడర్ల వద్ద ముందు జాగ్రత్తగా సిగ్నళ్లు ఏర్పాటు చేయాలి. – ధర్నాశి రాజు, బైక్ మెకానిక్

నేటితో ముగియనున్న చలానాల రాయితీ

- వాహన తనిఖీలతో పోలీసుల అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సత్తుపల్లిటౌన్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు పోలీసులు విధించిన ఈ–చలాన్లపై తెలంగాణ ప్రభుత్వం ఇటీవల రాయితీ ప్రకటించింది. ద్విచక్రవాహనాలపై 80 శాతం, ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు, జీప్‌లు, ట్యాక్సీలపై 60 శాతం, తోపుడు బండ్లపై 90 శాతం, భారీ వాహనాలపై 50 శాతం రాయితీ కల్పిస్తూ డిసెంబర్ 26 ఉత్తర్వ్యులు జారీ చేసింది. కాగా ఈ రాయితీ గడువు బుధవారంతో ముగియనుంది.

అవగాహన కల్పిస్తూ..

వాహనాలను ఆపి వాటిపై ఉన్న ఈ–చలాన్లను పోలీస్ సిబ్బంది ఆన్‌లైన్‌లో తనిఖీ చేసి వెంటనే చెల్లించినట్‌లైతే రాయితీ వర్తిస్తుందని వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ఈ పదిరోజుల్లోనే భారీగా వాహనదారులు మీసేవా కేంద్రాలలో ఈ–చలాన్ల బకాయిలు చెల్లించి రాయితీని సద్వినియోగం చేసుకున్నారు. వాహనదారులు పెండింగ్ చలాన్‌లు చెల్లించి రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లి జె.మోహన్‌బాబు కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో మనోబలం



ఇరుముడిలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి: ఆధ్యాత్మిక చింతనతో మనోబలం సిద్ధిస్తుందని, ప్రతీ ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని భాగ్యనగర్‌తండా, సామ్యతండా గ్రామాల్లోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయాల్లో అయ్యప్పస్వామి, హనుమాన్ మాలాధారుల ఇరుముడి కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిలీఫ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రమాజ్యోతి, నాయకులు హీరాలాల్, భీముడునాయక్, మేదరి టోనీ వీరప్రతాప్, వినోద్, వీరూనాయక్, హర్షానాయక్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఏన్కూరు: తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని మండల జేఏసీ కన్వీనర్ గిద్దగిరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొంటు సాంభయ్య, దేశిని గణేష్, ఇంజం దేవదాసు, కొవ్వూరి నాగేశ్వరరావు, మోరబోయిన కృష్ణ, కొడెం వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.

పద్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిటౌన్: వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేమన జయంతి సందర్భంగా మంగళవారం నిర్వహించిన వేమన పద్య పఠన పోటీల్లో స్థానిక టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కె.మౌనిష ప్రథమ బహుమతిని, సిహెచ్ లాస్య, మహ్మద్ సానియలు ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బి.మధుసూదన్‌రాజు బహుమతులు అందించారు. కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, ఇన్‌చార్జ్ శంకర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర పంట బీమా అమలు చేయాలి

వైరా: తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న కాజా రాధాకృష్ణమూర్తి వర్ధంతి సభ మంగళవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ... కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ రంగంపై గుత్తాధిపత్యం కోసం ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. నాయకులు సుంకర సుధాకర్, మచ్చా మణి, మల్లెంపాటి రామారావు, గుమ్మా నరసింహారావు, ఇమ్మడి వీరభద్రం, నరసింహారావు, కృష్ణ, రవి, అమరేంద్ర, మురళి, రాంబాబు, మోతీ, నారాయణ పాల్గొన్నారు.

గుడుంబా తయారీదారుడి అరెస్ట్

కల్లూరురూరల్: మండలంలోని కొత్తబోడిమెల్లలో నాటుసారా తయారు చేస్తున్న అజ్మీరా కిషోర్‌ను మంగళవారం ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై ఎం.వెంకటేశ్ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టి ఆయనను అదుపులోకి తీసుకోగా తహసీల్దార్ పులి సాంబవుడు ఎదుట బైండోవర్ చేశారు. తనిఖీల్లో ఉద్యోగులు భాస్కర్, ప్రేమ్, విజయ్ పాల్గొన్నారు.

పత్తి పంట ధ్వంసంపై కేసు

కారేపల్లి: పత్తిపంటను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదెంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేలకాయలపల్లికి చెందిన భూక్యా కాంతి, ఆమె మరిది భూక్యా లక్ష్మణ్ మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కాంతి పత్తి చేనుని లక్ష్మణ్ ధ్వంసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


క్యాలెండర్, డైరీలు ఆవిష్కరణ

సత్తుపల్లిరూరల్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ సంఘం సత్తుపల్లి డివిజన్ సంఘం నూతన సంవత్సర డైరీని స్థానిక సంఘ కార్యాలయంలో మంగళవారం డాక్టర్ కె.ప్రదీప్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కె.వైకుంఠరావు, కార్యదర్శి ఎంఎస్ఆర్ శర్మ, పద్మారావు, బి.లక్ష్మీనారాయణ, ఎం.గంగాధర్‌రాజు, డి.వెంకటేశ్వర్లు, జీవీఎస్ సాయి, రామారావు పాల్గొన్నారు.

ఏన్కూరు: ఫిబ్రవరి 11,12 తేదీల్లో ఖమ్మం జిల్లాలో జరిగే రాష్ట్ర విద్య, వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి గరిక శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో టీపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను ఎంఈఓ జయరాజు ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అప్పయ్య, ఫ్రాన్సిస్, నాయకులు బాల్‌సింగ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఏన్కూరు: క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు



సత్తుపల్లిరూరల్: డైరీల ఆవిష్కరణ...

రైల్వే ఉద్యోగుల నిరసన



మధిర: నిరసనలో పాల్గొన్న రైల్వే ఉద్యోగులు



కారేపల్లి: కారేపల్లి రైల్వే స్టేషన్ ఎదుట..

మధిర: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే ఉద్యోగులు నిరసన తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు హంగర్ స్ట్రైక్ చేస్తున్నారు. దీనిలో భాగంగా మధిర బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం మధిర రైల్వేస్టేషన్ సమీపంలో జరిగిన హంగర్ స్ట్రైక్ నిరసన కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ అనిల్ కుమార్ పాల్గొని మాట్లాడారు. తమ న్యాయమైన సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధిర బ్రాంచి మాజీ చైర్మన్ కోటేశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ కృష్ణ, రాజు, రవి, వీరప్రసాద్, ఉమ, ప్రవీణ్, వేణు, రవిచంద్ర, బాబురావు, నాగేశ్వరరావు, నరేష్, నాగరాజు, రాజశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి: కొత్తపెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తు కారేపల్లి రైల్వే స్టేషన్ ముందు రైల్వే ఉద్యోగులు మంగళవారం ఒక రోజు నిరహారదీక్షను నిర్వహించారు. ఏఐఆర్ఎఫ్ (ఆల్‌ఇండియా రైల్వే ఫెడరేషన్) ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు సింగరేణి సర్పంచ్ ఆదెర్ల స్రవంతి, నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. పిడమర్తి ప్రసాద్, భూక్యా బాలాజీ, నల్లమాద రమేష్, శ్రీను, హేమలత, శ్రీలత, సురేష్, రాజు, వీరన్న, శివప్రసాద్, వినోద్, చిన్న పాల్గొన్నారు.

ఆదాయం పెంపునకు కృషి చేద్దాం..



మాట్లాడుతున్న విజయశ్రీ

సత్తుపల్లిటౌన్: సంక్రాంతికి ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందరు సమిష్టిగా పని చేసి అత్యధిక ఆదాయం సాధించేందుకు కృషి చేద్దామని సత్తుపల్లి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం కండక్టర్లు, డ్రైవర్ల గేట్ మీటింగ్ నిర్వహించారు. ప్రయాణికులను ఎప్పటికప్పుడు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని, సాధ్యమైనంత వరకు సెలవులను వినియోగించుకోకుండా సంస్థ కోసం అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో వి.ప్రభాకర్, తిరుపయ్య, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

తల్లాడ: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీఓ శ్రీదేవికి కార్మికులు వినతిపత్రం అందజేశారు. పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్లకు ఐడీ కార్డులు, లైసెన్స్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రావు, కృష్ణారెడ్డి, రామక్రిష్ణ, కె.సతీష్, రాజా, బుజ్జి, గోపి, శివ, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు స్వాగతం

పెనుబల్లి : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలని, రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు నాయకులు జానపాటి వేణు, యువజన నాయకులు చీమల రమేష్ చేపట్టిన తిరుపతికి పాదయాత్ర మంగళవారం మండలానికి చేరింది. ఈ మేరకు స్థానిక నాయకులు వారికి స్వాగతం పలికారు.

వైద్య సేవలందించేందుకు ‘వికసిత భారత్’



మాట్లాడుతున్న వైద్యాధికారి రత్నమనోహర్

తల్లాడ: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వికసిత భారత్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు మండల వైద్యాధికారి రత్న మనోహర్ అన్నారు. తల్లాడ రైతు వేదికలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.శ్రీదేవి, సర్పంచులు పొట్టేటి సంధ్యారాణి, దుగ్గిదేవర సామ్రాజ్యం, ఎంపీటీసీ దగ్గుల రఘుపతిరెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ ఇబ్రహీం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న జైపాల్

వైరా: వైరా సత్రం బజార్‌లో రేచర్ల బ్రదర్స్, శ్రీకాంత్, వెంకటేష్, సత్రం బజార్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనికేతన్ పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలను మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ మంగళవారం ప్రారంభించారు. నాయకులు మిట్టపల్లినాగి, దార్న రాజశేఖర్, బండారు తిరపతిరావు, షేక్ అంజాద్, రేచర్ల రామారావు, శ్రీకాంత్, సమీర్, ఆనంద్, రాము, గోపి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్టీవెన్సన్

వైరారూరల్: మండలంలోని గరికపాడు గ్రామంలోని దేవుని సంఘం ప్రార్థనా మందిరంలో మంగళవారం వైరా పాస్టర్స్, ఇవాంజెలిస్ట్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బి. స్టీవెన్సన్ మాట్లాడుతూ.. నియోజవర్గంలోని ప్రతీ పట్టణంలో, గ్రామాల్లో క్రైస్తవులకు శ్మశాన వాటికలు నిర్మించాలని, అర్హులైన పాస్టర్లకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు వినోద్, కార్యదర్శి సురేష్, కోశాధికారి రూపాద్, కమిటీ సభ్యులు యోహోషువ, అజరయ్య, సుధాకర్, కొర్నేలి, విజయరాజు, యేహెజ్కెల్ తదితరులు పాల్గొన్నారు.

అక్షింతలు పంపిణీ

కొణిజర్ల: అయోధ్య నుండి వివిధ గ్రామాలకు వచ్చిన పూజా అక్షింతలను మండలంలోని పెద్దగోపతి గ్రామంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేళ తాళాలతో స్థానిక కోదండ రామాలయం నుంచి అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పంచారు. బొడ్డు రాంబాబు, సత్యం, మహిళలు తదితరులు పాల్గొన్నారు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారంలో అయోధ్య రాముల అక్షింతలను సర్పంచ్ చెట్టుమల రేణుక ఈశ్వర్ భక్తులకు పంపిణీ చేశారు. బొంతు నరేంద్ర, నరుకుళ్ల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



కొణిజర్ల: పెద్దగోపతిలో..



సత్తుపల్లిరూరల్: కిష్టారంలో..

పార్లమెంటరీ సమావేశానికి సండ్ర



తెలంగాణభవన్‌లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, నాయకులు

సత్తుపల్లి: హైద్రాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు మంగళవారం నిర్వహించిన ఖమ్మం పార్లమెంటరీ సన్నాహాక సమావేశానికి సత్తుపల్లి నియోజకవర్గం నుంచి శ్రేణులు తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.

సింగరేణి సీఎండీ ఎంపికపై హర్షం

సత్తుపల్లిటౌన్: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బలరాం నాయక్‌ను నియమించడంపై లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బాణోతు నందూనాయక్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్టీఆర్‌నగర్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో గిరిజన జాతి ఉద్యోగ, పదోన్నతి విషయాలలో సవతి తల్లి ప్రేమ చూపించిందన్నారు. ఈ సమావేశంలో గుగులోత్ మోహన్‌నాయక్, కేశవనాయక్, రాందాస్ రాథోడ్, నెహ్రూనాయక్, శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మధిరరూరల్: విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడమే ఉపాధ్యాయుల ప్రధాన లక్ష్యమని మధిర మండల నోడల్ అధికారి ముప్పా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆత్కూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం మాటూరు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీహరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డి.కవిత, జి.కేశవులు మాదిరి పాఠ్య బోధన చేయగా ఎఫ్ఎల్ఎన్ రిసోర్స్ పర్సన్ ఎండి.జమీర్, అసిస్టెంట్ సెక్రటరీ సంగు కృష్ణాంజనేయులు, హెచ్ఎం శ్యాం ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కారేపల్లి: సమారిటన్స్ ఫర్ ది నేషన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో కారేపల్లి పోలీసులు వలస కూలీలకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సుధాకర్, కిరణ్‌కుమార్, వెంకన్న, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

12 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ పోటీలు

కొణిజర్ల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కొణిజర్ల మండల కేంద్రంలో ఈ నెల 12 నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రఫి, శివ, సైదులు మంగళవారం తెలిపారు. ఎస్ఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.12,016, ద్వితీయ 10,016, తృతీయ బహుమతి 8,016, చతుర్థి బహుమతి రూ.6,016 లుగా నిర్ణయించినట్లు తెలిపారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 12 లోగా ఎంట్రీలు పంపించాలని, పూర్తి వివరాలకు 9966789360, 9000125016, 9603008891 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోండి

ఎర్రుపాలెం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు వచ్చే నెల 6వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని మండల తహసీల్దార్ ఉషాశారద కోరారు. మంగళవారం తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఓటు నమోదుకు డిగ్రీ మెమో ఒరిజినల్ లేదా ప్రొవిజినల్ సర్టిఫికేట్, ఓటర్ ఐడీ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ పత్రాలు అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. పట్టభద్రులందరూ ఓటుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని తెలిపారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సత్తుపల్లి: గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మట్టా దేవజ్యోతి మంగళవారం తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే పంపించాలని, రూ.100ల రుసుము దరఖాస్తు చేసేందుకు ఆన్‌లైన్‌లో చెల్లించాలని కోరారు.

సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి

వైరా: బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని ఫిబ్రవరి 15ని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు గుగులోత్ భావ్ సింగ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన వైరాలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకుని ప్రకటన చేయకపోతే బంజరాలతో సెక్రటేరియట్ ముట్టడి చేయడం ఖాయమన్నారు.

క్రిష్టియన్ కౌన్సిల్ కార్యవర్గం ఎన్నిక

తల్లాడ: నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ తల్లాడ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సంగసాని శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా ఇస్నేపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా హరీష్, మండల ప్రధాన కార్యదర్శిగా ఆర్.కరుణాకర్, సహాయ కార్యదర్శిగా కంచెపోగు జాషువా, కోశాధికారిగా ఎక్కిరాల జాన్సన్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా శాంసన్, ఎహెజ్కెల్ ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఏసుదాసు, పొలిటికల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పింగలి సామ్యూల్, జాన్ మార్క్ పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

కొణిజర్ల: 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా ఆరునెలలకొకసారి హెచ్ఐవీ పరీక్ష నిర్వహించుకోవాలని, హెచ్ఐవీ పాజిటివ్ ఉన్న వారు భయపడకుండా ప్రభుత్వాస్పత్రిలో ఇచ్చే మందులు వాడుతూ జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని డీఆర్‌పీ శివయ్య అన్నారు. మండలంలోని పెద్దమునగాలలో మంగళవారం వైఆర్‌జీ కేర్స్ లింక్ వర్కర్ స్కీమ్ వారి ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, అంగన్‌వాడీ టీచర్లు మణి, శిరోమణి, లింక్ వర్కర్ నాగమణి , స్థానికులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడిన వ్యక్తికి గాయాలు

బోనకల్: మండలంలోని రామాపురం సమీపాన రైలు నుంచి జారిపడినవ్యక్తికి గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా వాసి సంజయ్ సుతారి మేస్త్రీగా విజయవాడలో పని చేస్తూ తన స్వగ్రామానికి బయలుదేరాడు. విజయవాడ నుంచి ఆయన మంగళవారం రైలులో వెళ్తుండగా రామాపురం గేట్ సమీపంలో జారి పడగా గాయాలయ్యాయి. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.